





అల్లుకున్న నిర్లక్ష్యం..

తోరణాలు కట్టినట్టు అల్లుకున్న ఈ ఆకుపచ్చని లతల వెనుక ప్రమాదం పొంచిఉన్నది. సంగారెడ్డి జిల్లా కేంద్రంలో విద్యుత్ స్తంభాలు, వైర్లకు ఇలా పిచ్చితీగలు అల్లుకున్నాయి. ప్రమాదాలు జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు స్పందించి తీగలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

సాగుకు అడ్డుపడుతున్నారని..

- ఫారెస్టు ఆఫీసులో వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- అది ఫేక్ సర్టిఫికెట్: అటవీ అధికారులు



7

ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతు



చిన్నారిని బలి తీసుకున్న బడి బస్సు

- బస్సు దిగి వెళ్తున్న విద్యార్థిని అదే బస్సు ఢీకొట్టడంతో మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని గ్రామస్థుల ఆగ్రహం
- బస్సు ధ్వంసం

7

గొర్రెల మందను ఢీకొన్న టిప్పర్

- 30 గొర్రెలు మృత్యువాత
- గుమ్మడిదలలో కుక్కలదాడిలో 12 జీవాలు మృతి..



7

సంగుపేట వద్ద సర్వీస్ రోడ్‌పై చెల్లాచెదురుగా పడిఉన్న గొర్రెలు

పరిశ్రమల సహాయంతో

గురుకులం అభివృద్ధి

- తూప్రాన్ గురుకులంలో స్టడీరూంను ప్రారంభించిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ గురుకుల పాఠశాల, కళాశాలలో పరిశ్రమల సహాయంతో గణనీయమైన అభివృద్ధి జరిగిందని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులో టోల్‌ప్లాజా వద్ద గల గురుకులంలో రూ. 25 లక్షలతో నిర్మించిన స్టడీహాల్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. స్టడీహాల్ నిర్మాణంతో గురుకుల విద్యార్థులకు వసతులు మెరుగు పడ్డాయని కొనియాడారు. ఫిబ్రవరిలో రవాణా శాఖ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా సందర్శించి వాటర్ ఆర్వోప్లాంటు మరమ్మతులకు రూ. 50వేలు స్వయంగా అందజేశారని తెలిపారు. కంపెనీ సహాయంతో రూ. 25 లక్షలతో స్టడీహాల్, లైబ్రరీ నిర్మించారన్నారు. అనంతరం పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులతో కలిసి ముచ్చటించారు. భౌతికశాస్త్రం సులభంగా అధ్యయంచేసే విధానం కలెక్టర్ రాహుల్ రాజ్ ఉదహరణలతో బోధించారు. ఆర్డీవో జయచంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ, కమిషనర్ ఖాజామొహిజుద్దీన్, తహసీల్దారు విజయలక్ష్మి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

చెరుకు రైతులకు

మద్దతు ధర అందించండి

చక్కర కర్మాగార యాజమాన్యాలతో సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చెరుకు రైతులకు మద్దతు ధర అందించి సహకరించాలని చక్కర కర్మాగారాల యాజమాన్యాన్ని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో చక్కెర కర్మాగార యాజమాన్యం, రైతులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చక్కర పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు న్యాయం జరిగేలా పంటలకు తగిన ధర అందించేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా కల్పించారు. చెరుకు పంటకు మద్దతు ధర పెంపు, కూలీలు, వాహనాల కొరత లాంటి వివిధ అంశాలను పరిష్కరిస్తామని చెప్పారు. అనంతరం రైతులు మాట్లాడుతూ వటన్నుకు కనీసం రూ.4,500 మద్దతు ధరగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు.స్తేనే రైతులు వ్యవసాయం చేయగలరని రైతులు కలెక్టర్‌కు వివరించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిస్కారానికి కృషి చేస్తామని కలెక్టర్ క్రాంతి రైతులకు హామీ ఇచ్చారు.



గుమ్మడిదలలోని ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న పొగ

కాలుష్యం కాటు

చీకటి మాటున విషవాయువులు.. వర్షం చాటున వ్యర్థ జలాలు

- బోరు వేస్తే కలుషిత జలాలే..
- బీడువారుతున్న పొలాలు
- వ్యాధుల బారిన ప్రజలు
- పత్తా లేని పీసీబీ అధికారులు
- గుమ్మడిదల మండలంలో దుస్థితి

గుమ్మడిదల, అక్టోబరు 20 : గుమ్మడిదల మండల ప్రజలు వాయు, జల కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. రాత్రి వేళలో కంపెనీల నుంచి కాలుష్య వాయువులు, వర్షం చాటున రసాయన జలాలను బయటకు వదులుతుండడంతో సమీపంలోని గ్రామాల ప్రజలు రోగాలబారినపడుతున్నారు. చెరువులు, కుంటలు కలుషితమై నీరు ఎందుకూ పనికిరాకుండా పోతున్నది. పచ్చని పంటలు నాశనమై రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. మండలంలోని బొంతపల్లి, దోమడుగు, గుమ్మడిదల, అనంతారం, మంబాపూర్ గ్రామాల పరిధిలో పదుల సంఖ్యలో పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు నిబంధనలను ఉల్లంఘిస్తూ వాయు కాలుష్యాన్ని, రసాయన జలాలను బయటకు వదులుతున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికే ఈ పారిశ్రామికవాడల్లో భూగర్భ జలాలు కలుషితమై తాగుక, సాగుకు పనికిరాకుండా పోయాయని, ఇలాగే కొనసాగితే ప్రజలు జీవించడమే కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బొంతపల్లిలోని వీరభద్రనగర్ కాలనీలో రాత్రివేళలో విపరీతంగా కాలుష్యం బయటకు వదులుతుండడంతో

మిగతా 8వ పేజీలో..



రైస్‌మిల్లు నిర్వాకం

రోగాల బారిన పల్లె జనం!

- యథేచ్ఛగా వ్యర్థ జలాల విడుదల
- గ్రామానికి సమీపంలోనే నిల్వ
- ముక్కుపుటలదిరే దుర్గంధం
- ఛోద్యం చూస్తున్న అధికారులు

వట్‌పల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పచ్చని ప్రకృతి ఒడిలో ఉన్న ఆ ఊరి ప్రజలపాలిట రైస్‌మిల్లు శాపంగా మారింది. విచ్చలవిడిగా విడుదల చేస్తున్న కాలుష్య జలాలను నివాసాలకు దగ్గర్లోనే

మిగతా 8వ పేజీలో..

బాధితులకు అండగా

సైబర్‌సెల్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బాధితులకు అండగా నిలుస్తూ సంగారెడ్డి జిల్లా సైబర్ విభాగం ప్రజల మన్ననలు పొందుతోంది. హత్నూర మండలానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి నవీన్‌కు 2022లో ఆన్‌లైన్‌లో అపరిచిత వ్యక్తి పరిచయమయ్యాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్‌తో అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ చూపడంతో.. నవీన్ తన బ్యాంకు ఖాతా నుంచి రూ.30 లక్షలు అపరిచితుడి ఖాతాకు పంపించారు. తర్వాత అపరిచితుడి నుంచి స్పందన లేకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేశారు. దీంతో, సైబర్‌సెల్ వారు ఆయన పోగొట్టుకున్న మొత్తం నుంచి రూ.12.5 లక్షలు నవీన్ బ్యాంకు ఖాతాలోనే హోల్డ్ చేశారు. ఈ ఘటనపై హత్నూర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసి, బాధితుడి డబ్బును తిరిగి ఆయన ఖాతాలో జమ చేశారు. బాధితుడు నవీన్ సంగారెడ్డి ఎస్పీ రూపేష్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ రూపేష్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనవసర లింకులను ఓపెన్ చేయడం, ఆన్‌లైన్ గేమ్స్ ఆడటం వంటివి చేయకూడదని చెప్పారు. సైబర్ మోసాల బారినపడితే వెంటనే సైబర్ క్రైమ్ పోర్టల్‌లో కానీ, 1930 నంబర్‌కు కాల్ చేసి కానీ ఫిర్యాదు చేయాలని సూచించారు.



ఎస్పీని కలిసిన బాధితుడు నవీన్

మెదక్ డిగ్రీ కాలేజీ ఇక అటానమస్!

- ప్రత్యేక హోదా కోసం రిజిస్ట్రేషన్ పూర్తి
- ఇప్పటికే మూడుసార్లు న్యాక్ గుర్తింపు
- మెతుకుసీమలో మొదటి కళాశాలగా రికార్డు

మెదక్ అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మెదక్ డిగ్రీ కళాశాల అత్యున్నత ప్రమాణాలతో అంచెలంచెలుగా ఎదిగి స్వయం ప్రతిపత్తి సాధన దిశగా అడుగులు వేస్తోంది. కాలేజీ ఇప్పటివరకు మూడుసార్లు న్యాక్ గుర్తింపు పొందింది. ప్రస్తుతం కళాశాలకు బీ-ప్లస్ గుర్తింపు ఉంది. కాలేజీకి స్వయంప్రతిపత్తి హోదా 2024-25 విద్యాసంవత్సరంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేశారు. త్వరలోనేవిశ్వవిద్యాలయాల గ్రాంట్స్ కమిషన్ సానుకూల ప్రకటన చేస్తుందని భావిస్తున్నారు. స్వయంప్రతిపత్తి హోదా వస్తే కళాశాల అరుదైన అవకాశాన్ని సొంతం చేసుకోనుంది.



అటానమస్ హోదాతో పరీక్షల నిర్వహణలోనూ అధికారం లభిస్తుంది. నిరంతర పర్యవేక్షణతో ఫలితాల్లోనూ ప్రగతిని చాటొచ్చు.

మెదక్ జిల్లా కేంద్రంగా 1981లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. 25 ఎకరాల విశాలమైన ప్రాంగణంలో 50 గదులతో ఇది విస్తరించింది. ఆర్ట్స్, సైన్స్‌లో 18 కోర్సుల్లో 1,800 మంది విద్యార్థులు చదువుతున్నారు. 47 మంది అధ్యాపకులు బోధిస్తున్నారు. తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్ కూడా ఉంది. ఆటపాటల్లోనూ ఇక్కడి విద్యార్థులు తిరుగులేని ప్రతిభ చాటుతున్నారు. అటానమస్ హోదా వల్ల కాలేజీకి అనేక ప్రయోజనాలు చేకూరనున్నాయి. కళాశాలలో పత్యేక సిలబస్‌ను సైతం రూపొందించుకోచ్చు. 20 శాతం సిలబస్‌ను మార్చుకోవచ్చు. తద్వారా విద్యార్థులను ఆకర్షించవచ్చు. సొంతంగా కోర్సులను ఏర్పాటు చేసుకోవచ్చు. సొంత పరీక్షల విధానం, ప్రశ్నపత్రాల రూపకల్పన, మూల్యాంకనం కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేసుకోవచ్చు. సర్టిఫికెట్లను జారీ చేయవచ్చు. దీనిపై ప్రిన్సిపల్ డా.హుస్సేన్ మాట్లాడుతూ కళాశాలలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారించామని తెలిపారు.

వైద్య విద్యకు అంతా సిద్ధం

- మెడికల్ కళాశాల తరగతులకు ఏర్పాట్లు పూర్తి
- మెదక్‌లోని పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు
- మొదటి సంవత్సరం 50 సీట్లతో ప్రారంభం



మెదక్ అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా ప్రజల సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల కల సాకారమైంది. జిల్లాలో ఈ విద్యా సంవత్సరం నుంచే మెడికల్ కాలేజ్ అందుబాటులోకి రానుంది. కళాశాలకు శాశ్వత భవనం లేకపోవడంతో పిల్లికోటాల్‌లోని పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేశారు. మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 50 మంది విద్యార్థులు చేరడానికి ఇండియన్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడంతో కౌన్సెలింగ్లట అడ్మిషన్లు పొందారు. నేడు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభించనున్నారు.

ఎంబీబీఎస్ ఫస్టియర్‌లో 50 సీట్ల భర్తీ

2023లో అప్పటి ప్రభుత్వం మెదక్ జిల్లాకు 100 సీట్లలతో మెడికల్ కళాశాలను మంజూరు చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించాలని ఉత్తర్వులో పేర్కొంది. కళాశాల భవన నిర్మాణం కోసం రూ.180 కోట్లు మంజూరు చేసింది. పిల్లికొట్టాల్ మాతాశిశు సంరక్షణ ఆసుపత్రి పక్కన 14 ఎకరాల విస్తీర్ణం గల స్థలాన్ని కేటాయించింది.

మిగతా 8వ పేజీలో..

ఫీల్డ్‌లో ఉన్నారట!

- సమయపాలన పట్టని తహసీల్దార్ కార్యాలయాలు
- పనిపై బయట ఉన్నామని సమర్థింపు

ఆంధ్రజ్యోతి నెట్ వర్క్, సంగారెడ్డి, మెదక్ జిల్లా అక్టోబరు 23 : జిల్లా కేంద్రంలో ఉన్న సంగారెడ్డి మండల తహసీల్దార్ కార్యాలయంపై విమర్శలు ఉన్నాయి. ఇందుకు తగినట్టుగానే బుధవారం రోజున 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో నిజాలు వెలుగు చేశాయి. సమయం 11 దాటినా తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్ల కుర్చీలు ఖాళీగానే కనిపించాయి. సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో సగం మండలాల్లో ఇదే పరిస్థితి దాపురించింది. తహసీల్దార్ కార్యాలయాలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇష్టారాజ్యంగా వ్యవస్తున్నారనే విమర్శలు నెలకొన్నాయి. తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, ఆర్‌ఐలు ఫీల్డులో ఉండటం సహజమే కావచ్చు, కానీ ఇతర సిబ్బంది కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలనే విషయాన్ని మరుస్తున్నారు. యధారాజ తథాప్రజ అన్నట్టుగా అధికారులకు అనుగుణంగానే కిందిస్థాయి సిబ్బంది వ్యవహరిస్తున్నారు.



సదాశివపేటలో తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి సిబ్బంది లేకపోవడంతో చెట్ల కింద సేదతీరుతున్న ప్రజలు



నారాయణఖేడ్‌లో తహసీల్దార్ కోసం కార్యాలయం వద్ద వేచి ఉన్న అర్జీదారులు



కొండాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న తహసీల్దార్ చాంబర్

రెండు బైకులు ఢీకొని ఒకరి మృతి

కౌడిపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 23: ద్విచక్ర వాహనాలు ఢీ కొన్న ఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కంచన్‌పల్లిలో బుధవారం ఉదయం జరిగింది. మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన దుంపల్ల బాలకృష్ణ (21) ఎలక్ట్రీషియన్ పనిచేస్తున్నాడు. ఇదే క్రమంలో వెల్దుర్తి మండలంలోని మానెపల్లిలో పని నిమిత్తం తన మిత్రుడు జంగళ్ల భూమయ్య ద్విచక్రవాహనం నడుపుతుండగా బాలకృష్ణ వెనుక కూర్చొని వెళ్తున్నారు. అదే సమయంలో బైకుపై ఎదురుగా వచ్చిన అంకోళ పెంటయ్య బలంగా ఢీకొట్టడంతో బాలకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అతడిని సూరారంలోని ఓ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తి..


మహమ్మద్ మియా(ఫైల్)

పాపన్నపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం స్కూటీని ఢీకొట్టగా వ్యక్తి మృతిచెందాడు వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని యూసుఫ్‌పేటకు చెందిన రిటైర్డు పోస్టల్ ఉద్యోగి మహమ్మద్ మియా (62) పాపన్న పేట అంగడికి స్కూటీపై వచ్చి తిరిగి స్వగ్రామం వెళ్తున్నాడు. స్థానిక హాస్పిటల్ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు నిశ్చితార్థం జరిగిన మూడు రోజులకే మహమ్మద్ మియా చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి..

మునిపల్లి, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): సింగూరు ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వెళ్లి వల కాళ్లకు చుట్టుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్ నాయక్ తెలిపిన వివరాల ప్రకారం సదాశివపేట మండలం మాలపాడు గ్రామానికి దాసరి దుర్గయ్య (51) చేపలు పట్టి జీవనం సాగిస్తుండేవాడు. రోజు మాదిరిగానే మంగళవారం సాయంత్రం చేపలు పట్టేందుకు సింగూరు ప్రాజెక్టులోకి వెళ్లి రాత్రి అయినప్పటికీ తిరిగి రాలేదు. బుధవారం అక్కడికి వెళ్లి చూడగా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లి గ్రామ శివారులో గల నీటిలో దుర్గయ్య మృతదేహం కనిపించింది. మృతుడి భార్య కమలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.


మృతదేహాన్ని బయటికి తీస్తున్న దృశ్యం

శ్రమించి.. సాధించారు



ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు వారు. తల్లిదండ్రులు పడుతున్న శ్రమను గుర్తు చేసుకుంటూ చదువును ఇష్టంగా మార్చుకున్నారు .కష్టాలకు ఎదురీది మొదటి ప్రయత్నంలోనే గెజిటెడ్ ఉద్యోగాలను సొంతం చేసుకుని ప్రశంశలు అందుకుంటున్నారు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలానికి చెందిన రేణుక, శ్రీకాంత్, రవళి. వారు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షలో ప్రతిభను కనబర్చి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా ఎంపికయ్యారు. రేణుక, శ్రీకాంత్ నీటి పారుదల శాఖలో, రవళి మిషన్‌భగీరథలో విధులు నిర్వర్తించనున్నారు.

-నంగునూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

- మొదటి ప్రయత్నంలోనే గెజిటెడ్ ఉద్యోగాలు
- ఏకకాలంగా నంగునూరు మండల యువత

ఉపాధ్యాయుడి కుమార్తెకు ప్రభుత్వోద్యోగం

మండల కేంద్రమైన నంగునూరులోని పేద కుటుంబానికి చెందిన చిప్ప దత్తాద్రి తన చిన్నతనంలో బీడీలు చుడుతూ చదువుకున్నారు. బీడీలు చుడుతూ డిగ్రీ, బీఈడీ చేశారు. పెళ్లి తరువాత తన భార్య భూలక్ష్మితో కలిసి బీడీలు చుట్టి బతికేవారు. కూతురు రవళి పుట్టిన తరువాత జరిగిన డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. టీచర్‌గా పనిచేస్తూనే ఇంటికి వచ్చిన తరువాత ఆర్థిక కష్టాల నుంచి గట్టెక్కేందుకు భార్యతో కలిసి బీడీలు చుట్టేవాడు. తన కూతురు రవళిని ప్రభుత్వ పాఠశాలలో చదివించాడు.



నంగునూరు ఉన్నత పాఠశాలలో టెన్త్ చదివిన రవళి తన తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తెరిగి చదువుకున్నది. 2011లో నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 552 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. దీంతో బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. అక్కడ పీయూసీ(ఇంటర్మీడియేట్), బీటెక్(సివిల్ ఇంజనీరింగ్)చదివింది. 2017లో బీటెక్ పూర్తి చేసిన రవళి టీజీపీఎస్సీ నిర్వించిన పరీక్షలకు రాసింది. ఇటీవల విడుదల చేసిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పరీక్షా ఫలితాల్లో చక్కటి ప్రతిభ కనబరిచారు. మెరిట్ లిస్టు ప్రకారం రవళి మిషన్ భగీరథలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. ఈ నెలాఖరు లోగా ఉన్నతాధికారుల నుంచి నియామకపత్రం అందుకోనున్నారు.

అక్కల స్ఫూర్తితో ఉన్నత ఉద్యోగానికి..

మగ్దుంపూర్ గ్రామానికి చెందిన బట్టు రాజు, ఉపేంద్రమ్మ దంపతులు గ్రామంలో వ్యవసాయం చేస్తుంటారు. రాజు వ్యవసాయ పనులు లేని సమయంలో ఇంటి నిర్మాణ పనుల్లో మేస్త్రీగా పనిచేస్తూ తన పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించారు. మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన రాజు పెద్ద కూతురు రమ్య నాలుగేళ్ల కిందట టీఎస్పీఎస్సీ నిర్వహించిన పరీక్షలో ప్రతిభను చాటి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికై నీటిపారుదల శాఖలో పనిచేస్తున్నది. రెండో కూతురు అలేఖ్య బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. శ్రీకాంత్ ఇటీవల టీజీపీఎస్సీ ప్రకటించిన ఫలితాల్లో నీటిపారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో చదివిన శ్రీకాంత్ టెన్త్‌లో9.3 జీపీఏ సాధించాడు. ఇంటర్మీడియేట్‌లో 959 మార్కులు సాధించాడు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణా రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న సంగారెడ్డి జిల్లా కందిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) చదివి 2019 ఉత్తీర్ణులు అయ్యారు. బ్యాంకింగ్ పరీక్షలు రాసి కర్ణాటక బ్యాంకులో క్లర్కుగా ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ బ్రాంచీలో పని చేస్తున్నాడు. అక్కల స్ఫూర్తితో, తండ్రి కష్టాన్ని గుర్తుచేసుకుంటూ టీజీపీఎస్సీ పరీక్షలు రాశాడు. మొదటి ప్రయత్నంలోనే అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. సిద్దిపేట జిల్లాలోని నీటిపారుదల శాఖ గజ్వేల్ సర్కిల్‌లో ఏకకాలంగా విధులు నిర్వర్తించనున్నారు.


నియామక పత్రం అందుకుంటున్న మగ్దుంపూర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్

సత్తా చాటిన కూలీ బిడ్డ



మగ్దుంపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబంలో పుట్టిన బట్టు రేణుక మూడేళ్ల వయసులోనే తండ్రి అయిలయ్య చనిపోయారు. తల్లి రాజవ్వ వ్యవసాయ కూలీగా, బీడీలు చుడుతూ కూతురును పోషించింది. మగ్దుంపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకున్నది. టెన్త్‌లో 555 మార్కులు సాధించి మండల ఫస్ట్‌గా నిలిచింది. బాసరలోని ఐఐఐటీలో పీయూసీ(ఇంటర్), బీటెక్ (మెకానికల్ ఇంజనీరింగ్) పూర్తి చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎంఈ చదివిన రేణుక ప్రస్తుతం ఐఐటీ హైదరాబాదులో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఓవైపు ఉన్నత చదువులు చదువుతూనే టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షకు హాజరైంది. బట్టు రేణుక మహిళ కేటగిరీలో రాష్ట్ర 4వ ర్యాంక్ సాధించి సత్తా చాటారు. దీంతో నీటి పారుదల శాఖలో ఏకకాలంగా ఎంపికయ్యారు. నంగునూరు మండలం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పోస్టింగ్ పొందారు. సర్కారీ కొలువు సాధించిన రేణుకను గ్రామస్థులు, బంధువులు అభినందించారు. ఏకకాలంగా తెలంగాణ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను నెరవేర్చేందుకు కృషి చేస్తానని, ప్రాజెక్టుల ద్వారా నీళ్లను చివరి పంట పొలాల వరకు అందించేందుకు ప్రయత్నిస్తానని బట్టు రేణుక విశ్వాసం వ్యక్తం చేశారు.

చిన్నారిని బలి తీసుకున్న బడి బస్సు

- బస్సు దిగి వెళ్తున్న విద్యార్థిని అదే బస్సు ఢీకొట్టడంతో మృతి
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమన్న గ్రామస్థులు.. బస్సు ధ్వంసం


ఘటనా స్థలంలో రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

పెద్దశంకరంపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): బస్సు ఢీ కొని విద్యార్థిని మృతి చెందిన సంఘటన పెద్దశంకరంపేట మండల పరిధిలోని లక్ష్మాపూర్ గ్రామ శివారులో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోయిని చందు, సరిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె అశ్విని(6) మెదక్‌జిల్లా పెద్దశంకరంపేటలోని సాయి చైతన్య స్కూల్‌లో ఒకటవ తరగతి చదువుతుంది. రోజు మాదిరిగానే బుధవారం పాఠశాల ముగిసిన అనంతరం గ్రామాల్లో పిల్లలను దించేందుకు వెళ్లిన ఆ బడి బస్సు లక్ష్మాపూర్‌లో అశ్విని దించింది. విద్యార్థిని ఎటు వెళ్తుందో గమనించకుండా డ్రైవర్ బస్సు కదిలించడంతో బాలికను ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. ఆగ్రహించిన గ్రామస్థులు ఆ బస్సు అద్దాలను ధ్వంసం చేశారు. సంఘటనా స్థలంలో చిన్నారి మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోధనలు మిన్నంటాయి. ఘటన స్థలానికి అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి, పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సునీత, పులి, సిబ్బంది చేరుకుని వివరాలు సేకరించారు.

సాగుకు అడ్డుపడుతున్నారని..

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం ● అది ఫేక్ సర్టిఫికెట్: అటవీ అధికారులు


అధికారితో వాదనకు దిగిన బాధిత రైతు శ్రీను

కౌడిపల్లి, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 23: అటవీ అధికారులు సాగు చేసుకోకుండా అడ్డుపడుతున్నారని ఆరోపిస్తూ ఓ రైతు బుధవారం ఫారెస్టు కార్యాలయం ఎదుట ఒంటిపై డీజిల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండల పరిధిలోని అంతారం జైరాంతండాకు చెందిన బర్మవత్ శ్రీను కుటుంబానికి కన్నారం శివారులోని 92 సర్వే నంబర్‌లో మూడు ఎకరాల భూమికి సంబంధించి గతంలో ప్రభుత్వం పట్టా సర్టిఫికెట్ ఇచ్చిందని అతడు తెలిపాడు. అయినా సాగు చేసేందుకు ఫారెస్టు అధికారులు పెద్ద ఎత్తున డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, ఇవ్వకపోతే ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారని ఆరోపించాడు. ఇటీవల ట్రాక్టర్‌ను కూడా సీజ్ చేశారన్నారు. ఇదే విషయమై ఫారెస్టు రెంజ్ డివిజన్ అధికారి రాజమణిని సంప్రదించగా శ్రీనుకు ప్రభుత్వం నుంచి ఎటువంటి భూమి హక్కు పత్రాలు లేవని, ట్రైబల్ వెల్ఫేర్ మెదక్ కార్యాలయంలో వెతికినా ఎటువంటి ఆధారాలు లేవన్నారు. కొంతకాలంగా నకిలీ పట్టా పాసు పుస్తకాలను సృష్టించి వాటిపై తన కుటుంబీకుల ఫొటో అతికించి అధికారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

నేడు వైద్య కళాశాల తరగతులు ప్రారంభం

- విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యం
- పది నెలల్లో రూ.45 కోట్లతో పనులు
- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్ అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యం, అభివృద్ధి, సంక్షేమమే మా లక్ష్యమని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు స్పష్టం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని డీపీఆర్వో కార్యాలయంలో జర్నలిస్టులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభిస్తారన్నారు. మెదక్‌ను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎక్కడ లోపాలున్నాయో గుర్తించి, వాటిని చక్కబెట్టేందుకు సమగ్రా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నానని చెప్పారు. రామాయంపేటలో త్వరలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు కాబోతుందన్నారు. దాదాపు 20 ఎకరాల స్థలంలో అధునాత సౌకర్యాలు కల్పిస్తారన్నారు.

చేరువగా వైద్య విద్య..

మెడికల్ కళాశాల ఏర్పాటుతో పేద విద్యార్థులకు వైద్యవిద్యను చేరువ చేయడంతోపాటు ప్రజలకు మెరుగైన, సత్వర వైద్య సేవలందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. త్వరలో ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సీటీ స్కాన్ సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇటీవలే సెంట్రల్ మెడికల్ స్టోర్ మంజూరైందని వెల్లడించారు. మెదక్‌ను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. జిల్లా కేంద్రంలో ఎకరాల స్థలంలో పెద్ద పార్కును ఏర్పాటు చేస్తామన్నారు. ఏడుపాయల ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ప్రపంచ ప్రఖ్యాత గాంచిన మెదక్ చర్చి అభివృద్ధి కోసం విశేషంగా కృషి చేస్తానన్నారు. పోచారం అభయారణ్యంతోపాటు మెదక్ ఖిల్లా అభివృద్ధి కోసం నిధులు చేస్తామన్నారు. అతిపెద్ద అంబేద్కర్, హన్మంతుని, జీసస్ విగ్రహాలను ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. చెరువులను సుందరీకరణ చేపడుతామన్నారు.


మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

పదినెలలలో రూ. 45 కోట్ల నిధులు..

పది నెలల కాలంలో మెదక్ నియోజకవర్గానికి రూ. 45 కోట్ల నిధులు తెచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రత్యేక నిధులతో చౌరస్తాల అభివృద్ధితోపాటు మిని ట్యాంక్ బండ్‌ల సుందరీకరణ పనులు పూర్తి చేస్తామన్నారు. డ్రగ్స్ అండ్ కెమిస్ట్రి కార్యాలయంతోపాటు కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయ ఏర్పాటు విషయం సీఎం, మంత్రుల దృష్టి తీసుకెళ్లినట్లు వెల్లడించారు. తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు దిగులు చెందద్దన్నారు. అంతకుముందు ఆయన ప్రభుత్వ ఆసుప్రతిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కాంగ్రెస్ నేత బొజ్జపవన్, నాయకులు మహేష్, విశాల్ తదితరులు ఉన్నారు.

గొర్రెల మందను ఢీకొన్న టిప్పర్

- 30 గొర్రెలు మృత్యువాత
- గుమ్మడిదలలో కుక్కలదాడిలో 12 జీవాలు మృతి..

జోగిపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మేత కోసం వెళ్తోన్న గొర్రెల మందను అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టడంతో 30 జీవాలు మృత్యువాత పడిన ఘటన మండలంలోని సంగుపేట శివారులోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్‌పై జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా కస్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన శాకీరప్ప తన గొర్రెల మందను మేపుతూ సంచార జీవనం గడుపుతుంటాడు. శాకీరప్ప బుధవారం తన గొర్రెల మందను సంగుపేట శివారులోని జాతీయ రహదారి పక్కన మేపుతూ, సర్వీసు రోడ్డును దాటిస్తున్నాడు. ఈక్రమంలో, అటుగా వస్తున్న టిప్పర్ లారీని అజాగ్రత్తగా, అతి వేగంగా నడిపిన డ్రైవర్ గొర్రెల మందపైకి పోనిచ్చాడు. ఈ ప్రమాదంలో.. సుమారు 30 గొర్రెలు అక్కడిక్కడే మృతి చెందాయి. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని, టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. టిప్పర్ చౌటకూర్ మండలం సరాఫ్‌పల్లి గ్రామానికి చెందిన శివరాజ్ గౌడ్ అనే వ్యక్తికి చెందినదిగా గుర్తించారు. శాకీరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ప్రారంభించినట్టు ఎస్ఐ పాండు తెలిపారు.

వీధి కుక్కల దాడిలో 12గొర్రెలు..

గుమ్మడిదల, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 23 : మండల కేంద్రంలోని కురుమ సంఘం సమీపంలో ఉన్న తూపతి కృష్ణకు చెందిన గొర్రెల మందపై మంగళవారం అర్ధరాత్రి వీధి కుక్కలు దాడి చేశారు. ఈ ఘటనలో ఏకంగా 12 గొర్రెలు మృత్యువాతపడ్డాయి. రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, పాలు పార్టీల నాయకులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వీధి కుక్కల బెడద అరికట్టాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్మల గోవర్ధన్‌రెడ్డి బాధితుడికి రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.


గుమ్మడిదలలో మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న నాయకులు

బోనస్ ఇవ్వడంలేదని కార్మికుల నిరసన

పుల్‌కల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నా బోనస్ ఇవ్వడం లేదని, యాజమాన్యం శ్రమదోపిడికి పాల్పడుతున్నదని సీఐటీయూ అందోలు డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆరోపించారు. పుల్కల్ మండలం ఎస్.ఇటిక్యాల గ్రామ శివారులోని ఎంఎస్ ఇండస్ట్రీస్ ఎదుట బుధవారం ఆందోళన చేస్తున్న కార్మికులకు ఆయన మద్దతు ప్రకటించారు. కార్మికులు అధిక సంఖ్యలో విధులను బహిష్కరించి దాదాపుగా 9 గంటల పాటు పరిశ్రమ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి

- సంగారెడ్డి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు

నాగల్‌గిద్ద, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సంగారెడ్డి విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. నాగల్‌గిద్ద ప్రాథమిక, ఉన్నత, కస్తూర్బా, మనూరు మండలం పుల్‌కూర్తి కస్తూర్బా, గురుకుల పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఉపాధ్యాయులు మరుగుదొడ్ల సమస్యను డీఈవో దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం నాగల్‌గిద్ద జడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా హాస్టల్ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట పీఆర్టీయూ మండల అధ్యక్షుడు రమేష్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, బాపుశెట్టి, ఉపాధ్యాయులు సంగమేశ్వర్, లింగమేశ్వర్, తదితరులు ఉన్నారు.

సిర్గాపూర్ మండల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు..

కల్హేర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టాలని సిర్గాపూర్ మండల ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు సూచించారు. సిర్గాపూర్ మండల ప్రత్యేకాధికారిగా ఆయన బుధవారం ఎంపీపీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం అభివృద్ధి పనులపై పంచాయితీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుచూ గ్రామాల్లో పారిశుధ్య పనులు పక్కాగా అమలు చేయాలన్నారు. తాగునీటి సరఫరా, ఉపాధి హామీ, బీసీ కులగణన, నర్సరీల ఏర్పాటుపై శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో మల్హార్ నాయక్, ఎంపీఈవో బ్రహ్మం, ఈజీఎస్ ఏపీవో బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.


మనూరు మండలం పుల్‌కూర్తి కసూర్బాలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వర్లు

విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం తగదు

- ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు

మెదక్ అర్బన్ /సంగారెడ్డి రూరల్ అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్‌తో సర్కార్ చెలగాటం ఆడోద్దని ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా కార్యదర్శి దినకర్, సంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి మండిపడ్డారు. పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం చేపట్టారు. లోనికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో గేటు ముందు బైఠాయించి ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 27లోగా బకాయిలు విడుదల చేయాలని లేని పక్షంలో విద్యార్థులతో కలిసి హైదరాబాద్‌ను దిబ్బంధనం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మా సమస్యల పరిష్కారానికి కేసీఆర్ చొరవ చూపాలి

- మల్లన్నసాగర్ భూనిర్వాసితుల డిమాండ్


మాట్లాడుతున్న మల్లన్నసాగర్ భూ నిర్వాసితులు

గజ్వేల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : భూనిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కేసీఆర్ చొరవ చూపాలని, లేనిపక్షంలో ఆయన ఫాంహౌజ్ ముట్టడిస్తామని మల్లన్నసాగర్ భూనిర్వాసితులు హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నివాసంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. తమ సమస్యల గురించి గతంలో మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పచ్చటి పంటలు పండే పొలాలను లాక్కుని నిందలను కాంగ్రెస్‌పై మోపడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మాటే మాట్లాడని హరీశ్‌రావు ఇప్పుడు దేశంలోనే ఎక్కడా లేని విధంగా నష్టపరిహారం ఇచ్చామని, అద్భుతమైన కాలనీలను నిర్మించామని చెప్పడం దురదృష్టమన్నారు. నిర్వాసితుల గ్రామాల పేరుతో దోచుకున్న లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రామాలను బలవంతంగా ఖాళీ చేయించిన నాటి ప్రభుత్వం దారి ఖర్చులకు రూ.50 వేలు ఇచ్చామనడం సిగ్గు చేటన్నారు. మూసీకి, మల్లన్నసాగర్‌కు ముడిపెట్టి రాజకీయాలు చేయడం సరికాదన్నారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న కేసీఆర్, హరీశ్‌రావు, ప్రతాప్‌రెడ్డి తమ సమస్యలు పట్టించుకోకుండా ఇష్టారీతిన మాట్లాడడం ఏంటని ప్రశ్నించారు. తమ సమస్యల పరిష్కారానికి కేసీఆర్ ముందుకు వస్తే స్వాగతిస్తామని అన్నారు. వారివెంట గజ్వేల్ ఏఎంసీ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులున్నారు.

హత్నూర కాంగ్రెస్‌లో అంతర్మథనం

నామినేటెడ్ పదవులు దక్కడం లేదని ఆవేదన

సంగారెడ్డి జిల్లాలో చేరడమే శాపమా..?

హత్నూర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అనేక ఏళ్లూ కాంగ్రెస్ పార్టీని అంటిపెట్టుకొని పని చేస్తున్న నాయకులకు నామినేటెడ్ పదవుల్లో చోటు దక్కడం లేదని మండల సీనియర్ కాంగ్రెస్ నాయకులు అంతర్మథనం పడుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి గట్టి పట్టున్న హత్నూర మండలం నేడు నామినేటెడ్ పదవులు దక్కకపోవడంతో నిరాశనిస్పృహలకు గురవుతున్నారు. హత్నూర మండలం నుంచి దివంగత పీసీసీ రాష్ట్ర నాయకులు మచ్చ వాసుదేవరావు, ఎస్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యులు అయ్యవారి అశ్వరయ్యలు వంటి ముఖ్య నాయకులు హత్నూర మండలం నుంచి ప్రాతినిధ్యం వహించిన వారే. అయితే తెలంగాణ రాష్ట్ర అవతరణ అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం పేరుతో జిల్లా, మండలాల విభజన కారణంగా, నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు మెదక్ జిల్లా పరిధిలోకి వెళ్లగా, కేవలం హత్నూర మండలం సంగారెడ్డి జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండడంతో ఆ జిల్లాలో చేరిపోయింది. కొంత మేరకు పరిపాలన పరంగా బాగానే ఉన్నా, రాజకీయంగా మాత్రం ఇక్కడి నాయకులు ఇక్కట్ల పాలవుతున్నారు. రాజకీయ పార్టీ పదవులతో పాటు, అర్హతలు ఉన్న ఎలాంటి నామినేటెడ్ పదవులకు నోచుకోలేక పోతున్నారు. ఇక పార్టీ కోసం ఎంత కష్టపడినా ప్రయోజనం ఉండదేమోనన్న నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు. పార్టీ ఆది నాయకత్వం నామినేటెడ్ పదవుల్లో హత్నూర మండలానికి సమూచిత స్థానం కల్పించాలని కోరుతున్నారు.

రేగోడుకు అంబులెన్సు

రేగోడు అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో రేగోడుకు అంబులెన్స్ వచ్చేసింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దిగంబర రావు, రాయికోడ్ టీపీసీసీ మెంబర్ మున్నూరు కిషన్ బుధవారం నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు.

పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

పటాన్‌చెరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటుహక్కును నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు ఓటరు నమోదు అధికారి దేవుజ పేర్కొన్నారు. పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం, ఓటరు జాబితా తుది ముసాయిదా విడుదలపై తహసీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదలపై అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు.

● నాగల్‌గిద్ద, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రానున్న పట్టభద్రుల ఎన్నికల కోసం ఓటు హక్కు పొందేందుకు సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని నాగల్‌గిద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ అబ్దుల్ మాగ్ని పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకర్లతో మాట్లాడుతూ నవంబరు 6వ తేదీ వరకు చివరి గడువు ఉందన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

నర్సాపూర్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలను పర్యవేక్షించి పదోతరగతి విద్యార్థులకు పరీక్షలో ఉత్తమ ఫలితాలు రావడానికి పలు సూచనలు చేశారు.

డిగ్రీ కళాశాలను సందర్శించిన ఎమ్మెల్యే

సదాశివపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సదాశివపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఎమ్మెల్యే చింతాప్రభాకర్ బుధవారం సందర్శించారు. కళాశాలలో సదుపాయాలపై ఆరా తీశారు. కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తెలిపారు.

పరిశ్రమలో కుదిరిన వేతన ఒప్పందం

జిన్నారం, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొల్లారం పారిశ్రామికవాడలోని ర్యాంపెక్స్ పరిశ్రమలో మెరుగైన వేతన ఒప్పందం జరిగినట్లు కార్మిక సంఘం నాయకులు తెలిపారు. పరిశ్రమలో కార్మికులకు, యాజమాన్యం మధ్య జరిగిన చర్చల్లో రూ.9,100 వేతన ఒప్పందం అమలుకు నిర్ణయం తీసుకున్నారని ఈ మేరకు బుధవారం జిల్లా కార్మికశాఖ అధికారి రవీందర్ వేతన ఒప్పందపత్రాలను అందజేసినట్లు కార్మిక నాయకుడు వరప్రసాద్‌రెడ్డి తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

నర్సాపూర్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదల పాలిట సీఎంఆర్ఎఫ్ వరమని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నర్సాపూర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో మండలంలోని రామచంద్రాపురం, నర్సాపూర్, తుజాల్‌పూర్‌కు చెందిన పలువురు బాధితులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను అందచేశారు.

రిక్రియేషన్ క్లబ్ మెంబర్ కుటుంబానికి ఆర్థికసహాయం

నర్సాపూర్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ రిక్రియేషన్ క్లబ్ సభ్యుడిగా ఉన్న తొంట వెంకట్ ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. అయితే క్లబ్ మెంబరుగా ఉన్నవారు మరణిస్తే వారి కుటుంబానికి క్లబ్ తరపున రూ.10వేల ఆర్థిక సాయం అందిస్తారు. అందులో భాగంగా బుధవారం తొంటవెంకట్ కుటుంబీకులకు క్లబ్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో రూ. 10వేలను అందజేశారు.

చౌటకూరు- కొన్యాల రోడ్డుకు రూ.2.10 కోట్లు



మంజీర నదికి సమీపంలో అధ్వానంగా రోడ్డు

- మంత్రి చొరవతో దశాబ్దాల నిరీక్షణకు తెర
- చౌటకూర్ నుంచి నర్సాపూర్‌కు తగ్గనున్న 20 కి.మీ. ప్రయాణం
- వ్యవసాయ భూములకు రెక్కలు!

పుల్‌కల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ టు కొన్యాల రహదారికి మోక్షం లభించింది. మండల కేంద్రమైన చౌటకూర్ నుంచి హత్నూర, నర్సాపూర్ ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణం ఇక సులభతరం కానున్నది. దశాబ్దాల తరబడి మామూలు బండ్లబాటగా ఉన్న 3 కిలో మీటర్ల దారిని గతంలో ఫార్మేషన్ చేసి, కంకర రోడ్డుగా నిర్మాణం చేశారు. ఈ రోడ్డు బాగు చేస్తే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చౌటకూర్ గ్రామ ప్రజలు, రైతులు ఎన్నికల సమయంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనరసింహ దృష్టికి తీసుకువెళ్లారు.

తగ్గనున్న దూరభారం

చౌటకూర్ నుంచి సంగారెడ్డి ఎంఎన్ఆర్ చౌరస్తా వరకు 20 కిలో మీటర్లు, అక్కడి నుంచి మరో 30 కిలో మీటర్లు మొత్తం 50 కిలో మీటర్లు ప్రయాణించి నర్సాపూర్‌కు చేరుకుంటున్నారు. ప్రస్తుతం ఈ రహదారి ఏర్పాటుతో 20 కిలో మీటర్ల దూరభారం తగ్గనున్నది. రూ.2.10 కోట్ల నిధులతో రహదారిని పునరుద్ధరించనుండటంతో 25 ఫీట్ల రోడ్డుగా మారనున్నది.

నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు

ఇచ్చిన హామీ మేరకు మంత్రి చౌటకూర్-కొన్యాల రోడ్డుకు ప్రాధాన్యత కల్పించారు. ఈ మేరకు ఈ నెల 11వ తేదీన కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్ఆర్) కింద రూ.2.10 కోట్లు ప్రత్యేక నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలయ్యాయి. పుల్కల్, చౌటకూర్ మండలాల ప్రజలు హత్నూర, నర్సాపూర్ పట్టణాలకు వెళ్లాలంటే సంగారెడ్డి లేదా జోగిపేట ప్రాంతాల మీదుగా ప్రయాణిస్తున్నారు. చౌటకూర్-హత్నూర మండలాలకు మధ్య వారధిగా కొన్యాల గ్రామ శివారులో గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంజీర నదిపై హై లెవెల్ వంతెనను నిర్మించారు. అవతలి వైపు వంతెన వరకు రహదారి బాగానే ఉన్నది. మండల కేంద్రమైన చౌటకూర్ గ్రామ శివారు భూములన్నీ ఈ రహదారికి ఇరువైపులా మంజీర నది వంతెన వరకు విస్తరించి ఉన్నాయి. దీంతో వ్యవసాయ పనులకు వెళ్తున్న రైతులు, కూలీలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు సైతం నరకయాతన పడుతున్నారు. రహదారి నిర్మాణం పూర్తయితే చౌటకూర్, అందోలు మండలం అల్మాయిపేట గ్రామాల శివారు భూముల ధరలు పెరుగనున్నాయి. కొన్యాల రోడ్డు ఏర్పాటుతో రోడ్డుకు ఇరువైపులా భూములతో పాటు మంజీర నది తీరం వెంట భూములకు డిమాండ్ పెరుగనున్నది.

గొంగ్లూరు, కోడూరు రోడ్లు పునరుద్దరణ

పుల్కల్ మండలంలోని గొంగ్లూరు, కోడూరు గ్రామాల రోడ్ల పునరుద్ధరణకు కూడా నిధులు మంజూరయ్యాయి. గొంగ్లూరు నుంచి గిరిజన తండా వెళ్లేందుకు గల 1.4 కిలో మీటర్ల రహదారిని పునరుద్ధరించేందుకు రూ.98 లక్షలు మంజూరయ్యాయి. దీంతో పాటుగా కోడూరు నుండి గిరిజన తండా మీదుగా బొమ్మారెడ్డి గూడెం, లక్ష్మీసాగర్, కొండారెడ్డిపల్లి చౌరస్తా వరకు 7 కిలో మీటర్ల రోడ్డు పునరుద్ధరణకు రూ.4.69 కోట్లు నిధులు మంజూరు చేశారు.

సీఆర్ఆర్ నిధులతో గ్రామీణ రోడ్లకు మహర్దశ



ఎన్నికల ప్రచారంలో ఏ గ్రామానికి వెళ్లినా అధ్వానమైన రోడ్లు దర్శనమిచ్చాయి. రహదారుల నిర్మాణానికి కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ రోడ్స్ (సీఆర్ఆర్) కింద నిధులు మంజూరు చేయించాను. ప్రాధాన్యత క్రమంలో గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పిస్తా. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే మా లక్ష్యం.

- దామోదర రాజనరసింహ,
రాష్ట్ర వైద్యారోగ్యశాఖమంత్రి

ప్రజాసేవలపై ట్రైనీ ఐఏఎస్ అధికారుల ఆరా



నర్సాపూర్: ఆవంచలో పిల్లలతో కలిసి భోంచేస్తున్న అధికారులు

తూప్రాన్/నర్సాపూర్/కౌడిపల్లి/రామాయంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలోని పలు మండలాల్లో ట్రైనీ ఐఏఎస్ అధికారులు బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై స్థానిక అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామం పరిధిలోని న్యూ హమ్నాపూర్‌లో ట్రైనీ ఐఏఎస్ అధికారులు పర్యటించి గిరిజనుల స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. నర్సాపూర్ మండలం ఆవంచలో పర్యటిస్తున్న అధికారుల బృందం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి వారితో కలిసి భోజనం చేశారు. మనోహరాబాద్ మండలం కూచారంలో రెండో రోజు ట్రైనీ అధికారులు కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను, జడ్పీ ప్రభుత్వ పాఠశాలను సందర్శించి సౌకర్యాలు, వసతుల కల్పనపై ఆరా తీశారు. కౌడిపల్లి మండలంలోని రాయిలపూర్ గ్రామంలోని మహిళా సంఘాలసభ్యులతో మాట్లాడి రుణాల చెల్లింపు తీరుపై తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి బతుకమ్మ ఆడారు. రామాయంపేట మండలం ధర్మారంలో ట్రైనీ అధికారులు రెండో రోజు పర్యటనలో భాగంగా పీహెచ్‌సీని సందర్శించి వైద్యసేవలపై ఆరా తీశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



చేగుంట: నార్సింగిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

శివ్వంపేట/వెల్దుర్తి/చిన్నశంకరంపేట/చేగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): శివ్వంపేటమండల పరిధిలోని పలు గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని చండీ గ్రామంలో రామేశ్వరం చండీ రైతుల ఉత్పత్తి దారుల కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో, అలాగే నవాబ్‌పేట్ లచ్చిరెడ్డిగూడెం, చేన్నాపూర్, చిన్న గొట్టిముక్కుల, తిమ్మాపూర్ గుండ్లపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా మండలంలోని శివ్వంపేట, పెద్ద గొట్టిముక్కల, రత్నాపూర్ గ్రామాల్లో గురువారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో మధు యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్దురి మండలంలోని మనేపల్లి, మంగళపర్తి, యశ్వంతరావుపేట, మన్నెవారి జలాల్‌పూర్, కుకునూర్, దామరంచ, ధర్మారం, అందుగులపల్లి గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటి సీఈవో సిద్దయ్యతో కలిసి సొసైటి చైర్మన్ అనంతరెడ్డి ప్రారంభించారు. చిన్న శంకరంపేట మండలంలోని జంగరాయి, సొసైటీ అధ్వర్యంలో చందాపూర్, అంబాజిపేట, గవ్వలపల్లి, కొరివిపల్లి, గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. నార్సింగి మండల కేంద్రంలో బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు.

ధాన్యం ఆరబెట్టుకునేందుకు టాపర్లు ఇవ్వాలి

మెదక్ అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డు ఆవరణలో రైతులు ఆరబోసిన కల్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం తడవకుండా టాపర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఆలయాలపై దాడులను నిరసిస్తూ హిందూసంఘాల ఆధ్వర్యంలో బంద్



జహీరాబాద్‌లో హిందుసంఘాల ర్యాలీ

జహీరాబాద్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా హిందూ ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ జహీరాబాద్ పట్టణంలో హిందూసంఘాల ఆధ్వర్యంలో బుధవారం బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ముందుగా పట్టణంలోని భవానీమందిర్ వద్దకు వివిధ హిందూసంఘాల నాయకులు చేరుకుని బస్టాండ్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. ఆర్డీవో కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూసంఘాల నాయకులు మాట్లాడుతూ ఆలయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవో కార్యాలయ అధికారిని కోరారు. కార్యక్రమంలో హిందూ సంఘాలు, బీజేపీ నాయకులు జైపాల్‌రెడ్డి, గొల్లభాస్కర్, సుధీర్‌బండారీ, విశ్వనాథం, పూలసంతోష్, పాల్గొన్నారు.

● నారాయణఖేడ్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం హిందూ ఆలయాల పరిరక్షణ సమితి, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్‌ల పిలుపు మేరకు ఖేడ్‌లో బుధవారం బంద్ నిర్వహించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలోని దుకాణాలు, వ్యాపార, వాణిజ్యసంస్థలను స్వచ్ఛందంగా మూసివేశారు. ఖేడ్‌జంట గ్రామమైన మంగల్‌పేట దుర్గాభవానీ ఆలయం నుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

జహీరాబాద్,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ ప్రాంతంలో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. బుధవారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన బంద్ కార్యక్రమంలో అక్కడక్కడ జరిగిన స్వల్పఘటనలకు కారకులైన వారిని అదుపులోకి తీసుకుని కఠినచర్యలు తీసుకుంటామన్నారు. జహీరాబాద్ ప్రశాంత వాతావరణాన్ని నిరంతరం కొనసాగిద్దామన్నారు.

రైస్‌మిల్లు నిర్వాకం.. రోగాల బారిన పల్లె జనం!

(5వ పేజీ తరువాయి)

పేరుకుపోవడంతో ప్రజలు రోగాలబారినపడుతున్నారు. మిల్లు పక్కనుంచి వెళ్లాలంటేనే ముక్కుమూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. వట్‌పల్లి చౌరస్తాకు దగ్గర్లో మెటల్‌కుంట-అల్లాదుర్గం ప్రధాన రహదారి పక్కన గొర్రెకల్ గ్రామ పరిధిలో ఉన్న ఓ రైస్‌మిల్ నుంచి వెలువడే వ్యర్థ జలాలు, మురుగును ఎలాంటి శుద్ధి చేయకుండానే పెద్ద బావి తవ్వి అందులోకి వదులుతున్నారు. బావి నిండి మురుగు బయటకు ప్రవహించి రహదారి పక్కనే పేరుకుపోవడంతో భరించలేని దుర్గంధం వెలువడుతున్నది. దీంతో, వట్‌పల్లి చౌరస్తాతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముక్కుపుటలదిరే దుర్గంధంతో రోగాలు వ్యాపిస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. అంతేకాకుండా శుద్ధి చేయకుండానే వ్యర్థ జలాలను బావిలో నింపుతుండడంతో భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుటుపక్కల పొలాల్లో వ్యవసాయ పనులు చేసుకునేందుకు కూలీలు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. మెటల్‌కుంట-అల్లాదుర్గం ప్రధాన రహదారిపై వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు సైతం ఇక్కడికి రాగానే ముక్కుమూసుకుని ముందుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. మిల్లు యజమానుల నిర్లక్ష్యంతోనే ఈ దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఈ విషయంపై పత్రికల్లో వార్తలు వచ్చినా, ఫిర్యాదు చేసినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రోగాలబారిన పడుతున్నాం



సురేష్, వట్‌పల్లి తండావాసి

రైసుమిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యర్థ జలాలను బయటకు వదులుతుండడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. మిల్లు నుంచి వస్తున్న కాలుష్యంతో రోగాల బారినపడుతున్నాం. ఈ రోడ్డు పక్క నుంచి వెళ్లాలన్నా ముక్కుమూసువాల్సిందే. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు.

పారిశ్రామికవాడల్లో కాలుష్యం కాటు..

(5వ పేజీ తరువాయి)

కాలనీవాసులు ఇళ్లలో ఉండలేని దుస్థితి ఉందని వాపోతున్నారు. అనేకమంది అనారోగ్యం బారినపడుతున్నారని అంటున్నారు. కొన్ని పరిశ్రమలు మూలంగా ఇప్పటికే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో బోర్లు వేసినా కలుషిత జలాలే వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పారిశ్రామికవాడలోని కొన్ని పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్య జలాలు బయటికి వదలడంతో చెరువులు సైతం కాలుష్య జలాలతో కలుషితమై మూగజీవులపాలిట ప్రమాదకరంగా మారాయని వాపోతున్నారు. కాలుష్య జలాలతో పరిశ్రమ సమీపంలోని పంటలు నాశనమవుతున్నాయని రైతులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం కురిసిన వర్షానికి అనంతారం పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమ నుంచి రసాయన జలాలు బయటకు వదలడంతో పక్కనే చేతికొచ్చిన వరి పొలం పాడై రూ. లక్ష నష్టం జరిగినట్లు గుమ్మడిదల గ్రామానికి చెందిన రైతు అమ్మగారి మారుతిరెడ్డి ఆరోపించారు. పీసీబీ అధికారులకు ఫిర్యాదులు చేసినా తూతూమంత్రంగా శాంపిళ్లను సేకరించి, పరిశ్రమపై చర్యలు తీసుకుంటామని చెప్పినా ఏ చర్యలూ తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

రైతులకు నష్టపరిహారం అందించాలి



ఎ.మారుతిరెడ్డి, గుమ్మడిదల

గుమ్మడిదల మండలంలోని వివిధ పారిశ్రామిక వాడల్లో కాలుష్య జలాలతో నష్టపోయిన రైతులకు తక్షణమే నష్ట పరిహారం అందించి రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి. 2రోజుల క్రితం వర్షానికి శివశక్తి పరిశ్రమ అవుట్‌లైన్ ద్వారా మావరి పంటలోకి కలుషిత నీరు చేరి రూ. లక్ష మేర నష్టం వాటిల్లింది.

బాధ్యులపై చర్య తీసుకుంటాం: పీసీబీ ఈఈ పాఠక్

వాయు, జల కాలుష్యం ఏదైనా సమస్యను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. గుమ్మడిదల మండలంలోని వివిధ పారిశ్రామికవాడల్లోకాలుష్యం విచ్చలవిడిగా వెదజల్లుతున్న పరిశ్రమలను గుర్తిస్తాం. మా దృష్టికి వచ్చిన ఫిర్యాదుల పైన విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటాం.

వైద్య విద్యకు అంతా సిద్ధం...

(5వ పేజీ తరువాయి)

100 సీట్లతో మెడికల్ కళాశాల మంజూరు కాగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 50 సీట్లకు కుదించింది. శాశ్వత భవనం లేకపోవడంతో పాత కలెక్టరేట్ భవనంలో వైద్య కళాశాల ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం అందించిన నిధులతో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించారు. లెక్చర్‌హాళ్లు, విద్యార్థుల వసతి గృహాలు, అనాటమీ, ఫిజియోలజీ, బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లు,సెంట్రల్ లైబ్రరీ బోధన తదితర గదులు ఏర్పాటు చేశారు. ఈ పనులను కలెక్టర్ రాహుల్‌రాజ్ పలుమార్లు పరిశీలించారు. నేడు 50 సీట్లతో మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి.

శివ్వంపేటలో సెంట్రింగ్ డబ్బాలు చోరీ

శివ్వంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నిర్మాణంలో ఉన్న గుడి దగ్గర నుంచి గుర్తు తెలియని దుండగులు బుధవారం సెంట్రింగ్ బాక్సులను అపహరించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శివ్వంపేట పోలీస్‌స్టేషన్ ముందు గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎల్లమ్మ ఆలయం వద్ద ఉంచిన 100 సెంట్రింగ్ బాక్సులను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు గౌడసంఘం నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్ గౌడ్ తెలిపారు.

అక్రమంగా కలప వినియోగిస్తున్న పరిశ్రమకు జరిమానా

శివ్వంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమల్లో కలప వినియోగిస్తే ఉపేక్షించేది లేదని నర్సాపూర్ ఫారెస్ట్ రేంజ్ అధికారి అరవింద్ బుధవారం పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉసిరికపల్లి శివారులో ఆరుగొండ ఇన్‌ఫ్రాటెక్ ఇటుక పరిశ్రమలో నిబంధనలకు విరుద్ధంగా బాయిలర్‌లో వేప, తుమ్మ, చింత కలపను వినియోగించారు. ఈ మేరకు అరుగొండ ఇన్‌ఫ్రాటెక్ పరిశ్రమ యాజమాన్యానికి జిల్లా అటవీ శాఖ అధికారి ఆదేశాల మేరకు ఈనెల 18న రూ.49,520 జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్‌వో అరవింద్ తెలిపారు.

పార్ట్ బీ భూముల నక్షబాటను పరిశీలించిన జేసీ



కొంతాన్‌పల్లిలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

శివ్వంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భూములను పూర్తిస్థాయిలో సర్వే చేయించి రెవెన్యూ అటవీశాఖ హద్దులు ఏర్పాటు చేసి పార్టు బిలో ఉన్న అర్హులైన రైతులకు న్యాయం చేసి భూ సమస్య పరిష్కరిస్తామని అదనపు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని నవాబ్‌పేట గ్రామంలో బుధవారం సర్వే నంబర్ 216, 236, 262, 309, 417 పార్టు బి భూములను పరిశీలించారు. అనంతరం కాగా కొంతాన్ పల్లి గ్రామంలో గ్రామానికి చెందిన నాయకుడు గతంలో మాసానికుంట, కరీంకుంటకు వెళ్లే నక్ష బాటను కబ్జా చేశాడని గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రెవెన్యూ అధికారులు నక్షబాటకు హద్దులు ఏర్పాటు చేశారు. సదరు నక్షబాట హద్దులను మళ్లీ తొలగించడంతో ఇటీవల గ్రామస్థులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో బుధవారం కొంతాన్‌పల్లిలో నక్ష బాటను ఆయన పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొంతాన్‌పల్లిలో నక్షబాటను సర్వే చేయించి రికార్డు ప్రకారం పునరుద్ధరించాలని తహసీల్దార్ కమలాద్రిని ఆదేశించారు. నవాబ్‌పేట్‌లో పార్టు బి భూ సమస్యలు పరిష్కారం దిశగా చర్యలు చేపడతామని తెలిపారు.

అధ్యాపకుల సామర్థ్యంపైనే కళాశాల అభివృద్ధి

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో క్రిస్ప్ సహకారంతో కళాశాల అధ్యాపకులకు సంస్థాగత అభివృద్ధి ప్రణాళికను తయారుచేయడంలో నైపుణ్యాలను పెంపొందించుటకు బుధవారం ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్రిస్ప్‌కు చెందిన అఖిల్ సంస్థాగత అభివృద్ధి ప్రణాళికను తయారుచేయడంలో భాగంగా సంస్థకు సంబంధించి విజన్, మిషన్, స్వాఫ్ట్ అనాలసిస్, వ్యవస్థలక్ష్యాలు, వ్యూహాల గురించి అధ్యాపకులకు వివరించారు. అనంతరం శిక్షణ పొందిన ప్రిన్సిపాల్ రత్నప్రసాద్ అధ్యాపకులకు సర్టిఫికెట్లు అందజేశారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో విద్యుత్ ఉద్యోగుల సంఘం(టీఎస్ఈఈ యూనియన్-327 ఐఎన్‌టీయూసీ) సర్వసభ్య సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర జనరల్ సెక్రటీ శ్రీధర్, కంపెనీ ప్రెసిడెంట్ సురేశ్ కుమార్, సెక్రటరీ భూపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన జిల్లా అధ్యక్షుడిగా వీరయ్య, కోశాధికారిగా వెంకటేశం, సెక్రటరీగా శ్రీకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వినోద్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.


అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన



ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో అదనపు గదుల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న డీఈవో

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జడ్పీ హెచ్‌ఎస్)లో నాలుగు అదనపు గదుల నిర్మాణానికి బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు భూమి పూజ చేశారు. అదనపు గదుల నిర్మాణానికి ఓ పాట్ (వన్ స్కూల్ ఆట్ ఏ టైమ్) ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, మెడ్వాన్ సంస్థ ప్రతినిధులు ప్రమతి సాఫ్ట్‌వేర్ ప్రై.లిమిటెడ్, హైదరాబాద్ వారికి విన్నవించారు. దీంతో ఆ పరిశ్రమ వారు ముందుకు వచ్చి రూ. 75 లక్షల విరాలం అందజేసినట్లు మెడ్వాన్ సంస్థ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

లయన్స్ ఉచిత కంటి ఆసుపత్రి ప్రారంభోత్సవం



ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్క నాటుతున్న లయన్స్ ప్రతినిధులు

రామాయంపేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రామాయంపేటలో ఉచిత కంటి పరీక్ష కేంద్రాన్ని జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ నాగేష్ పాంపాటి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇకమీదట ఈ ప్రాంతానికి చెందిన ప్రజలు ఎలాంటి కంటి పరీక్షలనైనా ఎలాంటి ఖర్చు లేకుండా చికిత్స చేసుకోవచ్చన్నారు. అనంతరం ఇక్కడి ఓ ప్రైవేటు కళాశాలలో స్థానిక లయన్స్ క్లబ్ నిర్వహణలో క్యాన్సర్ పై అవగాహన సదస్సు జరిగింది. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కేబినెట్ సెక్రటరీ శ్రీధర్, శేషాచారి,జగన్నాథరావు,దామోదర్,జనతా శ్రీను, దేమె యాదగిరి పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న డీఏలు ఎగవేతేనా..?

● యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలు ఇవ్వకుండా ఎగవేస్తారా అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు ప్రశ్నించారు. సంగారెడ్డిలో బుధవారం నిర్వహించిన యూనియన్ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వాల్సిన నాలుగు పెండింగ్ డీఏలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుని సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

చెట్ల తిమ్మాయిపల్లిలో జీఎంఆర్ విద్యాదాన్ ఉత్సవ్

మాసాయిపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలం చెట్లతిమ్మాయిపల్లి పులిగుట్ట తండా ప్రాథమికపాఠశాలలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు విద్యాదాన్ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. వరలక్ష్మీ ఫౌండేషన్ ప్రతినిధులు రాంచరణ్‌కుమార్, రామకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై పుస్తకాలు, పెన్నులు, వివిద నోట్ బుక్స్ అందించారు. జీఎంఆర్ ఆధ్వర్యంలో ఏటా పేద విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రిని అందిస్తున్నట్టు వారు తెలిపారు.